www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 31 మే 2024



నేటి నుంచి విజయవాడ ఫాస్ట్ పునరుద్ధరణ



ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం-గుంటూరు మధ్య 17282 నెంబర్‌తో నడిచే ఫాస్ట్ ప్యాసింజర్ రైలును శుక్రవారం నుంచి పునరుద్ధరిస్తున్నామని నరసాపురం రైల్వే అధికారులు తెలిపారు. అయితే ఈ ఫాస్ట్ ప్యాసింజర్ విజయవాడ వరకే వెళ్తుందని, గుంటూరు వెళ్లదని తెలిపారు. ఈ రైలు ఉదయం 6.05 గంటలకు నరసాపురంలో బయలుదేరి పది గంటలకు విజయవాడ చేరుకుంటుందన్నారు. 17281 నెంబర్‌తో సాయంత్రం 6.50 గంటలకు విజయవాడలో బయలుదేరి రాత్రి 10:30 గంటలకు నరసాపురం చేరుకుంటుందన్నారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని కోరారు.

కౌంటింగ్.. ఫీవర్..!



- మరో 4 రోజుల్లో ఓట్ల లెక్కింపు
- అభ్యర్థులు, పందెంరాయుళ్లు, కార్యకర్తల్లో టెన్షన్
- రెండు జిల్లాల్లోనూ రూ.కోట్లలో బెట్టింగ్
- పైకి ధీమాగా ఉన్నా ఫలితాలపై లోలోన ఆందోళన
- గడిచిన 17 రోజులుగా పోలింగ్‌పై రకరకాల లెక్కలు
- ప్రభుత్వ ఏర్పాటులో జిల్లా ఈసారి కీలకమవుతుందా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల కౌంటింగ్ ఫీవర్ అందరినీ చుట్టేస్తోంది. ఓట్ల లెక్కింపునకు మరో నాలుగు రోజులు మాత్రమే సమయం ఉండటంతో ఏ ఇద్దరిని కలిసినా దీనిపైనే చర్చ సాగుతోంది. ఏ స్థానంలో ఎవరు గెలుస్తారు.. ఏ అభ్యర్థికి ఎంత మెజార్టీ వస్తోంది. హోరాహోరీగా సాగిన స్థానాల్లో ఏ అభ్యర్థికి అవకాశం ఉంటుంది. ఇలా అనేక రకాల చర్చలు జనాల్లో సాగుతున్నాయి. మే 13న పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత అభ్యర్థులు, కార్యకర్తలంతా సేదతీరుతూ కొంత ఉపశమనం పొందినట్లు కన్పించారు. కౌంటింగ్ ప్రక్రియ దగ్గర పడుతుండటంతో అభ్యర్థులతోపాటు పందెంరాయుళ్లు, ఆయా పార్టీల కార్యకర్తల్లోనూ మళ్లీ హైటెన్షన్ నెలకొంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. జూన్ నాలుగో తేదీన జరిగే ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ప్రతి నియోజకవర్గానికీ 14 టేబుల్స్ వరకూ ఏర్పాటు చేస్తున్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించి, అనంతరం ఇవిఎంల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. పోలైన ఓట్లను బట్టి ప్రతి నియోజకవర్గానికి సంబంధించి 16 నుంచి 21 రౌండ్లలో స్పష్టమైన ఫలితం వెల్లడి కానుంది. నాలుగైదు రౌండ్లలో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారో చాలావరకూ తెలిసే అవకాశం ఉందని అంచనాలు వేస్తున్నారు. ఫలితాలపై నిన్నమొన్నటి వరకూ ధీమాగా ఉన్న నాయకులు, కార్యకర్తలంతా ఓట్ల లెక్కింపు దగ్గర పడుతున్న కొద్దీ తీవ్ర ఆందోళనకు గురవుతున్న పరిస్థితులు కన్పిస్తున్నాయి. చాలామంది నాయకులు, కార్యకర్తలు టెన్షన్ తట్టుకోలేకపోతున్నామంటూ చెబుతున్నారు. రెండు జిల్లాల్లోనూ ప్రతి నియోజకవర్గ పరిధిలోనూ రూ.కోట్లలో బెట్టింగ్ జరిగింది. అభ్యర్థుల గెలుపు, మెజార్టీ, గ్రామాలవారీగా మెజార్టీ ఇలా అనేక రూపాల్లో పందేల జోరు సాగింది. కౌంటింగ్ ప్రకియ దగ్గర పడుతుండటంతో పందెంరాయుళ్లలో టెన్షన్ తారాస్థాయికి చేరుతోంది. ఏం జరుగుతుందోననే ఆందోళన కన్పిస్తోంది. ముఖ్యంగా ఆచంట, ఉండి, దెందులూరు, నూజివీడు వంటి నియోజకవర్గాల్లో ఎన్నికల పోరు మరింత హోరాహోరీగా సాగింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారు.. మెజార్టీ ఎంత వస్తుందనే చర్చ తీవ్రంగా నడుస్తోంది. తెలిసిన వారందరికీ ఫోన్లు చేసి అభ్యర్థి గెలుపుపై ఆరా తీస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. దాదాపు గడిచిన మూడు వారాలుగా అభ్యర్థులు, కార్యకర్తలంతా పోలింగ్ సరళిపై వేయని లెక్కలు లేవు. గ్రామాలవారీగా, సామాజిక తరగతులవారీగా ఓట్ల తీరుపై సైతం లెక్కలు వేశారు. అయినప్పటికీ లోలోన ఆందోళన మాత్రం ప్రధాన పార్టీలకు చెందిన నాయకులను వెంటాడుతోంది. పెరిగిన ఓటింగ్ ఎవరికి లాభ పడుతుందోననే భయం అందరినీ పీడిస్తోంది.

ప్రభుత్వ ఏర్పాటులో ఉమ్మడి జిల్లా మళ్లీ కీలకం అవుతుందా?

భయగోదావరి జిల్లాల్లో ఎన్నికల సరళి మిగిలిన జిల్లాలకు భిన్నంగా ఉంటుందని చెప్పొచ్చు. ఎన్నికల్లో ఏదోక పార్టీని గంపగుత్తగా గెలిపించడం ఈ జిల్లాల్లో ఒరవడిగా కొనసాగుతోంది. గడిచిన రెండు సాధారణ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే ఈవిషయం అందరికీ అర్థమవుతోంది. 2014లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాల్లో టిడిపి, బిజెపి అభ్యర్థులను ఇక్కడి ప్రజలు గెలిపించారు. తూర్పుగోదావరి జిల్లాలోనూ అత్యధిక స్థానాలు టిడిపి గెలుచుకుంది. దీంతో రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం వంటి జిల్లాల్లోనూ వైసిపికి అత్యధిక స్థానాలు వచ్చినా ఉభయగోదావరి జిల్లాలో వచ్చిన ఎక్కువ సీట్లే అప్పట్లో టిడిపి ప్రభుత్వ ఏర్పాటుకు కీలకంగా మారాయి. 2019లో జరిగిన ఎన్నికల్లో 15 స్థానాలకుగాను 13 స్థానాలతోపాటు, రెండు ఎంపీ స్థానాల్లోని వైసిపి అభ్యర్థులనే ఇక్కడి ప్రజలు గెలిపించారు. తూర్పుగోదావరి జిల్లాలోనూ అదే పరిస్థితి కొనసాగింది. దీంతో వైసిపికి భారీ మెజార్టీ వచ్చిపడింది. ఈసారి ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. దీంతో ఏ పార్టీకి ఎన్ని సీట్లు అనేదానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఈసారి ప్రభుత్వ ఏర్పాటులోనూ జిల్లాలోని స్థానాలు కీలకంగా మారనున్నాయా అనే చర్చ సాగుతోంది. దీంతో జిల్లాలోని స్థానాలపై ఎవరి లెక్కలు వారు వేసుకుంటూ అంచనాలు కడుతున్నారు.

ఉన్మాది ఘాతుకం

యువతి పీక కోసి హత్య - ఆపై తానూ కోసుకుని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

'ఇటీవలే నిశ్చితార్థమైంది. త్వరలోనే వైవాహిక జీవితంలో అడుగుపెట్టి మరిన్ని ఉన్నత స్థానాలకు ఎదగాలనే ఆ యువతి ఆకాంక్షలను ఉన్మాది చిదిమేశాడు. తాను పని చేస్తున్న విద్యాసంస్థలో తనతోపాటు ఫ్యాకల్టీగా పని చేస్తున్న యువకునితో యువతికి వివాహం కుదిరింది. ఈ నెల 26నే నిశ్చితార్థమైంది. ఈ క్రమంలో బ్యాంకు పని నిమిత్తం గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికొచ్చిన ఆ యువతిపై గతంలో ప్రేమ పేరుతో వెంట పడిన యువకుడు హఠాత్తుగా దాడి చేసి పీక కోసేశాడు. ఆమె రక్తపు మడుగులో గిలగిలా కొట్టుకుంటుంటే తాను కూడా పీక కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చేటప్పటికే యువతి మృతి చెందింది. పోలీసులు అక్కడికి హుటాహుటీన చేరుకుని తీవ్ర గాయాలతో పడి ఉన్న ఉన్మాదిని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన ఏలూరు నగరంలో తీవ్ర కలకలం సృష్టించింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.



హత్యకు గురైన యువతి, పక్కనే ఉన్మాది



రత్నగ్రేస్ (ఫైల్‌ఫొటో)

ఏలూరు నగరంలోని ఎంఆర్‌సి కాలనీకి చెందిన జక్కుల రత్నగ్రేస్ (22) స్థానికంగా తల్లిదండ్రులతో కలిసి జీవిస్తోంది. ప్రస్తుతం సిద్ధార్థ ఇంటర్మీడియట్ కళాశాలలో ఫ్యాకల్టీగా పని చేస్తోంది. అదే కళాశాలలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్న మరో వ్యక్తితో రత్నగ్రేస్‌కు ఈ నెల 26న నిశ్చితార్థమైంది. అయితే గ్రేస్ వెంట కొంతకాలంగా మండల కేంద్రమైన ముసునూరుకు చెందిన తొట్టిబోయిన ఏసురత్నం (23) ప్రేమిస్తున్నానంటూ వెంటపడుతున్నాడు. యువతి ఆ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు తమ కుమార్తె జోలికి రావొద్దని హెచ్చరించారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం రత్నగ్రేస్ బ్యాంకు పనిపై ఇంటి నుంచి బయటికి వచ్చింది. అప్పటికే ఆ ప్రాంతంలో మాటువేసి ఉన్న ఏసురత్నం ఒక్కసారిగా రత్నగ్రేస్‌పై దాడి చేసి విచక్షణారహితంగా పీక కోసేశాడు. దీంతో రక్తపుమడుగులో రత్నగ్రేస్ గిలగిలాకొట్టుకుంటూ ప్రాణాలు విడిచింది. వెంటనే ఏసురత్నం పీక కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న ఏసురత్నాన్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించారు. రత్నగ్రేస్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏలూరు త్రీటౌన్ సిఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐద్వా ఖండన

ఏలూరు అర్బన్: సత్రంపాడులో రత్నగ్రేస్ అనే యువతి గొంతు కోసి హత్య చేయడాన్ని ఐద్వా ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి తీవ్రంగా ఖండించారు. గురువారం సాయంత్రం ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో రాణి మాట్లాడారు. రోజురోజుకీ మహిళలపై వేధింపులు, దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చదువుకునే యువతులపై ప్రేమోన్మాదులు చెలరేగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు సినిమా, టీవీ, ఇంటర్నెట్‌పై నియంత్రణ విధించాలని, అశ్లీలత, హింస లేకుండా నిరోధించాలని ఆమె డిమాండ్ చేశారు. రత్నగ్రేస్ కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జి.శారద, పి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డు లేకపోతే..

కౌంటింగ్ కేంద్రంలోకి నో ఎంట్రీ

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఎన్నికల సంఘం, అధికారులు జారీ చేసిన గుర్తింపు కార్డు లేకపోతే ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి అనుమతించేది లేదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా స్పష్టం చేశారు. గురువారం ఆయన పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో పర్యటించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలైన ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల, విష్ణు కళాశాలలను సందర్శించి కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఇవిఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను కలెక్టర్ సుమిత్ కుమార్, బందోబస్తు ఏర్పాట్లను ఎస్పి అజిత వేజెండ్ల వివరించారు. దీనిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా పలు సూచనలు చేస్తూ జిల్లాలో పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించడాన్ని అభినందించారు. అదేస్ఫూర్తితో కీలకమైన కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రం ప్రవేశ ద్వారం నుంచి 100 మీటర్ల దూరంలో వాహనాలను నిలిపివేయాలని చెప్పారు. తొలుత ముఖేష్‌కుమార్ మీనాకు పశ్చిమగోదావరి జిల్లా సరిహద్దు లోసరి వద్ద కలెక్టర్ సుమిత్‌కుమార్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతోపాటు డిఆర్‌ఒ జె.ఉదయభాస్కరరావు, ఎఎస్‌పి వి.భీమారావు, సెబ్ ఎఎస్‌పి ఎటివి.రవికుమార్ తదితరులు ఉన్నారు.



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా

దోపిడీరహిత సమాజ స్థాపన సిఐటియు లక్ష్యం

ఘనంగా ఆవిర్బావ దినోత్సవం

ప్రజాశక్తి - భీమవరం

రానున్న రోజుల్లో ఐక్య పోరాటాల ద్వారా హక్కులు కాపాడుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ ఉద్యోగ, కార్మికులకు పిలుపునిచ్చారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా స్థానిక సిఐటియు ఆఫీస్ వద్ద సిఐటియు జెండావిష్కరణ చేశారు. పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు అధ్యక్షతన జరిగిన సభలో రాయ్ మాట్లాడుతూ 1970 మే 30న దేశవ్యాప్తంగా కొద్దిమందితో సిఐటియు ఆవిర్భవించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలను కాపాడుకోవడానికి అనేక పోరాటాలు నిర్వహించిందని, 1975లో రైల్వే సమ్మెలో కీలకపాత్ర నిర్వహించిందని వివరించారు. బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, విశాఖ స్టీల్ వంటి ప్రభుత్వ రంగ పరిశ్రమలు స్థాపించడానికి అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. అసంఘటిత రంగ కార్మికులు, బజారు, హమాలీ, భవననిర్మాణ కార్మికులకు చట్టాలు తీసుకురావడానికి ఉధృత పోరాటాలు సాగించిందన్నారు. సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఐక్య పోరాటాలు నిర్వహించిందన్నారు. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు ఐక్య పోరాటాల ద్వారా పోరాడి సాధించుకున్న చట్టాలను కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.ఆంజనేయులు, ఎస్.శిరీష్, మెడికల్ రిప్స్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, ఎస్.సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు, కె.కృష్ణ, డి.వీరబాబు పాల్గొన్నారు.

వీరవాసరం: కార్మిక, కర్షక, పేదలు ఐక్యతతో మరిన్ని విస్తృత పోరాటాలు నిర్వహించాల్సి ఉందని సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు అన్నారు. సిఐటియు ఆవిర్భావం సందర్భంగా వీరవాసరంలో గురువారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ 1970లో సిఐటియు ఏర్పడిందని, ఆనాటి నుంచి నేటి వరకూ ఉద్యోగ కార్మికుల ఐక్యత కోసం నిరంతరం దేశమంతటా కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షురాలు వరలక్ష్మి, సత్తిబాబు, నిర్మల, మంగ, శాంతి, రామలక్ష్మి పాల్గొన్నారు.


పాలకోడేరు : దోపిడీ రహిత సమాజ స్థాపన సిఐటియు లక్ష్యమని సంఘం జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ తెలిపారు. సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శృంగవృక్షం రైస్ మిల్ వద్ద కార్మిక కర్షక చిహ్నంతో కూడిన అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడారు. సమాజాభివృద్ధిలో శ్రమ చాలా కీలకమన్నారు. అలాంటి శ్రమ దోపిడీకి గురైనంత కాలం అసమానతలు కొనసాగుతూనే ఉంటాయన్నారు. దేశవ్యాప్తంగా చారిత్రాత్మక పోరాటాలు నడిపిన ఘనత సిఐటియుకు ఉందన్నారు. దేశంలో మతసామరస్యానికి తూట్లు పొడిచేలా మతం పేరుతో చేస్తున్న దాడిని తిప్పి కొట్టాలంటే కార్మిక కర్షక పేదలంతా ఐక్యమవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సేశపు అశ్రియ్య, గోపాల రాజు, సుబ్బారావు పాల్గొన్నారు.



భీమవరంలో సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న రాయ్



పాలకోడేరులో..



తాడేపల్లిగూడెంలో..

తాడేపల్లిగూడెం టౌన్ : సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు ఆవిర్భావ దినోత్సవ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ హాజరయ్యారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అపరాలు మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ ఆఫీసు వద్ద కర్రి నాగేశ్వరరావు, పండ్ల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ ఆఫీసు వద్ద జవ్వాది శ్రీను, కూరగాయలు మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ ఆఫీసు వద్ద గొర్రెల సతీష్ కుమార్, చింతపండు మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ ఆఫీసు వద్ద నరమాల కృష్ణ, యార్డు మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ ఆఫీసు వద్ద మేట్రెడ్డి రమణ, ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ ఆఫీసు వద్ద పులిమంతుల రమణ, ఎరువులు మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ ఆఫీసు వద్ద కుంచంగి నానాజీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆఫీసు వద్ద ధనాల వెంకట్రావు, 3ఎఫ్ వర్కర్స్ యూనియన్ ఆఫీసు వద్ద తాటిపర్తి గణ్ణేశ్వరరావు జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడారు. సిఐటియు ఏర్పడి 54 సంవత్సరాల కాలంలో కార్మికులకు అనేక చట్టాలు, రాయితీలను సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు. అలాగే ఉల్లిపాయలు మార్కెట్ ఆఫీస్ వద్ద చల్లా చందర్రావు అధ్యక్షతన సిఐటియు జెండాను ఆవిష్కరించారు. అనంతరం సభనుద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరుపు రంగారావు, నాయకులు అల్లు సుబ్బారావు, బంకురు నాగేశ్వరరావు మాట్లాడారు.

అలాగే తాలూకా రైల్వే గూడ్స్ వద్ద, రైల్వే గూడ్స్ షెడ్ వద్ద సిఐటియు జెండాను యూనియన్ అధ్యక్షులు సత్తి కోదండరామిరెడ్డి ఎగరవేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడారు. 1991లో నూతన ఆర్థిక విధానాలు, ప్రయివేటీకరణ, సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా దేశంలోని 11 జాతీయ కార్మిక సంఘాలను రాష్ట్ర ఫెడరేషన్లను, మేధావులు, వివిధ వర్గాలను కలుపుకుని దేశంలో 22 జాతీయ కార్మిక సమ్మెలు జరిగాయని దానికి సిఐటియు ప్రధాన పాత్ర పోషించిందని తెలిపారు. కార్యక్రమంలో కర్రి సాయిరెడ్డి, అడప ఆంజనేయులు, కర్రి సుబ్బిరెడ్డి, కరి శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల నారాయణ, అడ్డగర్ల కృష్ణ, మద్దాల పుత్రయ్య, గాది వెంకటరావు, నాని, రెడ్డి పాల్గొన్నారు.

తణుకు : కార్మికులకు కనీస వేతనం, పాత కార్మిక చట్టాలు కావాలంటే పోరాటాలే శరణ్యమని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. గురువారం స్థానిక అమరవీరుల భవనం వద్ద, వాన్‌బరి వద్ద సిఐటియు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడారు. సిఐటియు కార్మిక వర్గ రాజ్యం కోసం, కులం, మతం, ప్రాంతం వంటి సమస్యలు లేని సమసమాజం కోసం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.దక్షిణామూర్తి, పిఎల్ నర్సింహారావు, మండల కార్యదర్శి గుబ్బల గోపి, వాన్‌బరి యూనియన్ కార్యదర్శి వల్లూరి వెంకటేశ్వరరావు, గోవిందరాజు, ఎస్.రామకృష్ణ, వై.మందులయ్య, లలితకుమార్ పాల్గొన్నారు.

మొగల్తూరు : అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సిఐటియు ఆవిర్భవించిందని సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తెలగంశెట్టి సత్యనారాయణ అన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కార్మికులు ప్రసన్నకుమారి, జి.పెద్దింట్లు, దుర్గ, పి.బోసుబాబు, బజాజ్ జట్టు కార్మికులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు సహకరించాలి

ఆర్ఓ వి.స్వామినాయుడు

ప్రజాశక్తి - ఆచంట

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అంతా సహకరించాలని, కౌంటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నట్లు ఆచంట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. స్వామినాయుడు మాట్లాడుతూ కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ పూర్తి చేశామన్నారు. ఇప్పటికే రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లకు కౌంటింగ్‌లో పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించామన్నారు. కౌంటింగ్‌కు సంబంధించి ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. భీమవరం సీతా పాలిటెక్నిక్ కళాశాల రెండో అంతస్తులో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇవిఎం ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్ ఏర్పాటు చేశామని, ప్రతి టేబుల్ వద్దా ఒక సూపర్‌వైజర్, సహాయకుడు, మైక్రో అబ్జర్వర్‌ను నియమించామన్నారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు నాలుగు టేబుల్స్ ఏర్పాటు చేశామని, ప్రతి టేబుల్ వద్దా ఒక సహాయ రిటర్నింగ్ అధికారి, సూపర్‌వైజర్, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లను నియమిస్తున్నామని తెలిపారు. కౌంటింగ్ టేబుల్స్ సంఖ్యకు అనుగుణంగానే ఏజెంట్లను అనుమతిస్తామని, వారికి ఫారం-18 గుర్తింపు కార్డులు జారీ చేస్తామని చెప్పారు. నేరచరిత్ర కలిగిన వారిని, బైండోవర్ కేసులు నమోదైన వారిని కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించకుండా అభ్యర్థులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. అభ్యర్థినిగాని, ఆయన ఏజెంటునుగాని ఎవరో ఒకరిని మాత్రమే రిటర్నింగ్ అధికారి టేబుల్ వద్దకు అనుమతిస్తామన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యాక ఐదు ఇవిఎంలకు చెందిన వివి.ప్యాట్స్‌లోని ఓట్లను లాటరీ పద్దతిలో ఎంపిక చేసి లెక్కిస్తామని తెలిపారు. జూన్ ఆరో తేదీ వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుందన్నారు. అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, బాణసంచా వినియోగించరాదని తెలిపారు. కౌంటింగ్ అనంతరం రౌండ్లవారీగా ఆయా యూనిట్లను స్ట్రాంగ్ రూములో భద్రపరుస్తామని తెలిపారు. నరసాపురం డిఎస్‌పి జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఐపి.శెట్టి, ఎంపిడిఒలు పి.నరసింహప్రసాద్, ఎస్.శ్రీనివాస్‌దొర, పి.పద్మజ, డి.సుహాసిని, పెనుగొండ సిఐ ఎన్.రజినికుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి స్వామినాయుడు

విజ్ఞానం, వినోదంతో మంచి ఫలితాలు

జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రామలక్ష్మణ్

ప్రజాశక్తి - పెనుమంత్ర

కష్టంగా కాకుండా ఇష్టంగా.. వినోదం ప్రధానంగా నేర్చుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించొచ్చని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రామలక్ష్మణ్ అన్నారు. గురువారం పొలమూరులోని కలిదిండి సూర్యనారాయణరాజు జన విజ్ఞాన కళా వేదిక ప్రాంగణంలో జరిగిన పది రోజుల వేసవి వినోద శిక్షణ ముగింపులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వివిధ అంశాల్లో శిక్షణ పొందిన సుమారు 60 మంది విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక ప్రచురించిన విలువైన విజ్ఞానదాయక పుస్తకాలను బహుమతులుగా ఆయన అందజేశారు. దీనికి ముందు పిల్లలకు ఆక్వా కల్చర్, చేప, రొయ్య పెంపకపు చెరువుల వల్ల లాభ నష్టాలు గురించి పివిపిఎఫ్ ఆక్వా సంస్థ సైంటిస్ట్ కుక్కల సురేష్ వివరించి చెరువుల క్షేత్ర సందర్శన చేయించారు. ఈ కార్యక్రమాల్లో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కేతా పద్మజ, జనవిజ్ఞాన వేదిక జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి ఉదయ్‌కిరణ్, ప్రతినిధులు చింతపల్లి శ్రీలక్ష్మి, కేతా ప్రమోద్, సిహెచ్.భారతి, చందు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో జెవివి నేతలు

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని గొంది గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలపై తేనెటీగల గుంపు గురువారం దాడి చేసింది. తేనెటీగలు దాడి చేయడంతో అక్కడున్న కూలీలందరూ పరుగులు తీశారు. ఈ ఘటనలో యర్రంశెట్టి నాగరాజు, మోకా నరసింహరావు గాయపడ్డారు. గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ శీలబోయిన ఆంజనేయులు వీరిని పాలకొల్లులో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వీరిద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. బాధితులను ఎపిఇ వై.శ్రీనివాస్, సాగునీటి సంఘం మాజీ డైరెక్టర్ యర్రంశెట్టి నాగేశ్వరరావు తదితరులు పరామర్శించారు.



తేనెటీగలు కుట్టిన వ్యక్తికి వైద్యం చేస్తున్న డాక్టర్

18 రెవెన్యూ గ్రామాల్లో ఉపాధి పనులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని 18 రెవెన్యూ గ్రామాల్లో అవసరమున్న 48 చోట్ల ఉపాధి హామీ చట్టం కింద పనులు జరుగుతున్నాయని ఎంపిడిఓ పి.పద్మజ, చట్టం అదనపు కార్యక్రమ నిర్వహణ అధికారి టి.వి.బాబ్జీ తెలిపారు. గురువారం వారు ప్రజాశక్తితో మాట్లాడారు. మండలంలోని కాలువగట్లలో పిచ్చి మొక్కలు తొలగించడం, పంట కాలువల్లో, మురుగు కాలువల్లో పూడికలు తీయడంతో పాటు, తాగునీటి చెరువుల్లో మట్టి పూడిక పనులు చేస్తున్నారని అన్నారు. మండలంలోని పోలమూరు, ఆలమూరు, నెలమూరు, నత్తారామేశ్వరం తదితర ప్రాంతాల్లో 2842 మంది పురుష, మహిళా కార్మికులు ఉపాధి హామీ పనుల్లో ఉన్నారని తెలిపారు. వీరికి ప్రతి వారమూ కూలి చెల్లిస్తున్నామని తెలిపారు.

విద్యాసామగ్రి అందజేత

పాలకొల్లు:పట్టణంలోని జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలకు ఎనిమిది సంవత్సరాలుగా డిస్ట్రిక్ లయన్స్ లీడర్‌షిప్ చైర్మన్ పివిఎస్‌వి వరప్రసాద్ రూ.12,000 విలువైన విద్యాసామగ్రిని పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వి లవ్ రీడింగ్‌లో భాగంగా భీమవరం డివిజన్లోనే ప్రతి పాఠశాలకూ పది చొప్పున కథల పుస్తకాలు అందజేశారని, ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిలోనూ దాతల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. ప్రతి పాఠశాలలో మొక్కలు పెంచాలన్నారు. ఈ సందర్భంగా విద్యా సామగ్రిని బహూకరించారు. ఈ సందర్భంగా పిఎంసి సభ్యులు, విద్యార్థులు, పట్టణ ప్రముఖులు దాతను అభినందించారు.

కొనసాగిన వేసవి శిక్షణ శిబిరం

నరసాపురం:నరసాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల సందర్భంగా గురువారం విద్యార్థుల చేత తెనాలి రామకృష్ణ కథలు, చందమామ, బాలమిత్ర కథలు అక్బర్ బీర్బల్, పంచతంత్ర, తాతయ్య చెప్పిన కథలు, మర్యాద రామన్న కథలు చదివించారు. బార్క్ సీనియర్ శాస్త్రవేత్త రంగినేడి సుబ్బారావు పిల్లలకు మానవ శరీర నిర్మాణం నాడీ మండల వ్యవస్థ గురించి వివరించారు. ఆర్టిస్ట్ తోట శ్రీనివాస్ పిల్లలకు నెమలి బొమ్మలు వేయడం నేర్పించారు. రిసోర్స్ పర్సన్ తామరపు కృష్ణ పిల్లల చేత ధ్యానం, కరాటే చేయించారు. అలాగూ క్యారమ్స్, మెమరీ గేమ్స్ ఆడించారు. ఈ శిక్షణ తరగతులు గ్రేడ్ వన్ లైబ్రరీయన్ కెజెఎస్ఎల్.కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఉండి : ప్రతి విద్యార్థిలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని యండగండి కో ఆపరేటివ్ రూరల్ బ్యాంక్ ఉద్యోగి మమత అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం యండగండి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్ పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ విద్యార్థులు వేసవి శిబిరంలో భాగంగా పేపర్ క్రాఫ్ట్‌పై అవగాహన అలవర్చుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 32 మంది విద్యార్థులు పేపర్ క్రాఫ్ట్‌పై శిక్షణ తీసుకున్నారని గ్రంథాలయ అధికారి ఎన్‌సిహెచ్ రామకృష్ణ తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేగేశ్న సత్యరాజ్ మాట్లాడారు.

రుచిగా భోజనం వండి పెట్టాలి

ఉండి:ఇంటి భోజనాన్ని మరిపించేలా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రుచిగా వండి పెట్టాలని మధ్యాహ్న భోజన సమన్వయకర్త కె.కృష్ణారావు మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు గురువారం ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఇఒ-2 బొక్కా వినాయకుడు అధ్యక్షతన మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కె.కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యతతో రుచిగా వండి పెట్టాలన్నారు. ప్రతి విద్యార్థీ పాఠశాలలోనే భోజనం చేసేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. గతంలో మధ్యాహ్నం భోజనం పథకాన్ని కొన్ని ఏజెన్సీలకు ఇవ్వడం జరిగిందని వారిపై విద్యార్థుల నుంచి అనేక ఫిర్యాదులు రావడంతో మరలా నిర్వాహకులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు, మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కవి ప్రసాద్‌కు సన్మానం

తణుకు రూరల్:తణుకు పట్టణానికి చెందిన కవి ప్రసాద్‌ను శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఏలూరులో అంతర్జాతీయ శతాధిక పద్య కవుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కవి ప్రసాద్ ఈ సమ్మేళనంలో సీసా పద్యాలను చదివి వినిపించారు. కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్, ఏలూరు శాఖ అధ్యక్షులు శ్రీహరి కోటలు సంయుక్తంగా ప్రసాద్‌కు స్వర్ణకంకణం తొడిగారు. అనంతరం మానవత విద్యానిధి చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, హేలాపురి సింగర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సావర్ల నాయక్, మహిళా అధ్యక్షురాలు శ్యామల కోట, ప్రసాద్‌ను సన్మానించి ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు. 175 మంది కవులు పాల్గొన్న ఈ కవి సమ్మేళనంలో తనకు గుర్తింపు లభించడం విశేషమని ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ను పట్టణ ప్రముఖులు అభినందించారు.

అండర్ టన్నెల్ నిర్మించండి : సిపిఎం

ఆకివీడు:ఆకివీడులో రైల్వే అండర్ టన్నెల్ నిర్మించాలని సిపిఎం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో సిపిఎం నాయకులు పెంకి అప్పారావు అధ్యక్షతన పట్టణ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తవిటినాయుడు మాట్లాడుతూ రైల్వే రెండో లైను వేసిన తర్వాత దిగువనున్న కొల్లేటి గ్రామాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని తెలిపారు. ఈ మార్గంలో గతంలో లేనంతగా ట్రాఫిక్ పెరిగిందన్నారు. ప్రతి 20 నిమిషాలకూ ఒక రైలు వెళ్తోందని, ఎప్పుడు చూసినా గేట్లు వేసే ఉంటున్నాయని అన్నారు. ఈ పరిస్థితుల్లో గేటుకు రెండు పక్కలా తిరగాల్సిన ప్రజలు, వేలకు వేల ఎకరాల భూములకు ఎరువులు ధాన్యం వంట సామగ్రి చేపల చెరువుల ఎరువులు తదితర వాహనాల రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉందన్నారు. గతంలో ఇదే సమస్యపై నాటి ఎంపీ రఘు రామ కృష్ణంరాజుకు, రైల్వే అధికారులకు వినతిపత్రం సమర్పించినట్లు ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో డోకల లక్ష్మి, బి.రాంబాబు, బివి.వర్మ, డోకల రవితేజ పాల్గొన్నారు.

కిశోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని లంకలకోడేరు ప్రాజెక్టు పరిధిలో ఐసిడిఎస్ సిడిపిఒ సిచ్.ఇందిర ఆధ్వర్యంలో కిశోర బాలికలు ఆరోగ్య, రుతుస్రావ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నవ్య జీవన్ మాట్లాడారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్‌పి.ఎలిజిబెత్, ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, సూపర్‌వైజర్ డి.కమల, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పి.సత్యవేణి, ఎన్.మంగ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

పెనుగొండ : మహిళలు, కిశోర బాలికులు రుతుక్రమం, పరిశుభ్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఐసిడిఎస్ అధికారి వద్దనపు రూత్‌కుమారి తెలిపారు. గురువారం కిశోర బాలికులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం రత్నకుమారి, స్పెక్టర్‌లో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యాబోధనే 'రూట్స్' లక్ష్యం

ప్రజాశక్తి - తణుకు



రూట్స్ స్కూల్

తణుకు పట్టణంలో తొలి 'ఐఐటి' ఫౌండేషన్ స్కూల్‌గా స్థాపించి విద్యార్థులకు ఉత్తమ, క్రమశిక్షణ గల విద్యనందిస్తున్నామని రూట్స్ స్కూల్ డైరెక్టర్ అండ్ ప్రిన్సిపల్ ఎల్.కె.త్రిపాఠి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ప్రీ స్కూల్ నుంచి పదో తరగతి వరకూ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో మనోవికాసాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. విషయ పరిజ్ఞానానికి ప్రతి వారమూ వివిధ విషయాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే వివిధ పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు విజయాలు సొంతం చేసుకుని పాఠశాలకు దేశ వ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చారని స్కూల్ డైరెక్టర్ బి.విద్యాకాంత్ తెలిపారు. క్రీడలు, పాటలు, నృత్యాలు, ఏకపాత్రాభినయం, వ్యక్తిత్వవికాసం, అబాకస్, చేతిరాత తదితర అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు అగ్రగామిగా నిలిచారని స్కూల్ డైరెక్టర్ ఎస్.సుధాకర్‌వర్మ తెలిపారు. బట్టీ విధానానికి స్వస్తి చెప్పి సృజనాత్మకతతో కూడిన విద్యనందిస్తున్నామని తెలిపారు. సాధారణ విద్యార్థులను సైతం అసాధారణ విద్యార్థులుగా తీర్చిదిద్దటమే రూట్స్ లక్ష్యమన్నారు.



స్కూల్ డైరెక్టర్ ఎల్‌కె.త్రిపాఠి



స్కూల్ డైరెక్టర్ సుధాకర్‌వర్మ



స్కూల్ డైరెక్టర్ విద్యాకాంత్

సాధించిన విజయాలు..

- దేశంలోనే అత్యుత్తమ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఐఐఎం కలకత్తా నుంచి ఎంబిఎ డిగ్రీ సాధించిన రూట్స్ పూర్వ విద్యార్థి సిహెచ్.శివసూర్యకిరణ్
- పూర్వ విద్యార్థి ఎడిబిఎల్ హేమంత్ ఐఐఎం లక్నోలో ఎంబిఎ డిగ్రీ చదువుతున్నారు.
- ఐఐటి, జెఇఇ ఓపెన్ కేటగిరిలో రూట్స్ పూర్వ విద్యార్థులు విజయాలు సాధించారు.
- ఎస్.సిరిప్రణీత ఆలిండియా 515వ ర్యాంకు, వై.సాయిసాత్విక్ ఆలిండియా 527వ ర్యాంకు, కె.చిన్మయ్ ఆలిండియా 815వ ర్యాంకు, పి. సాయిభాస్కర్ ఆలిండియా 1289వ ర్యాంకు, ఎ.వి.ఎల్.హేమంత్ ఆలిండియా 1710వ ర్యాంకు, ఎ.హరిసుప్రియ ఆలిండియా 3558వ ర్యాంకు సాధించారు.
- 2015-16, 2016-17 విద్యా సంవత్సరంలో తమ విద్యార్థులు ఐఐటి మెయిన్స్‌లో 246, 209, 206, 184, 161, 149 మార్కులతో 47 మందికి పైగా ఐఐటి అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించి విజయభేరి మోగించారు.
- ఎంసెట్‌లో పూర్వ విద్యార్థులు ఎవిఎల్. హేమంత్ స్టేట్ 51వ ర్యాంకు, ఎస్.సిరిప్రణీత స్టేట్ 185వ ర్యాంకు, ఎన్.సుదీప్తి స్టేట్ 194వ ర్యాంకు, కె.రోహిత్‌సాయి స్టేట్ 638వ ర్యాంకు, పి.సాయిభాస్కర్ స్టేట్ 716వ ర్యాంకు, ఆర్.జ్యోతేంద్ర 1018వ ర్యాంకు సాధించారు.
- ఎంసెట్ మెడికల్‌లో కూడా రూట్స్ పూర్వ విద్యార్థులు జెఎస్ఎల్.ప్రత్యూష స్టేట్ 88వ ర్యాంకు, ఎం.ప్రసన్న 316వ ర్యాంకు, ఎస్.రవీంద్ర 404వ ర్యాంకు, ఇ.సాయివెంకట్ 823వ ర్యాంకు, వి.దినకర్‌సాయి 1011వ ర్యాంకు, ఎస్.అపర్ణసాయి 1200వ ర్యాంకు సాధించారు.

తమ సంస్థలో చదివిన పూర్వ విద్యార్థులు ఎం.కాంతికిరణ్ ఇసెట్‌లో స్టేట్‌లో మొదటి ర్యాంకు సాధించగా, కె.జగదీష్ ఎనిమిదో ర్యాంకు సాధించారు. అలాగే ఎపిఆర్‌జెసిలో ఎ.హరి సుప్రియ స్టేట్ 2వ ర్యాంకు, ఎస్.జయచంద్రగౌడ్ స్టేట్ 23వ ర్యాంకు సాధించారు. ప్రతిభా అవార్డులను కెహెచ్.చంద్రావతి, సిహెచ్. కార్తీక్, సిహెచ్. కళ్యాణి, కె.భార్గవిసాయిలక్ష్మీ కైవసం చేసుకున్నారు. రాష్ట్రంలోనే 6 బెస్ట్ స్కూల్ అవార్డులను పొందిన విద్యాసంస్థ రూట్స్. సుచిరిండియా ఫౌండేషన్, హైదరాబాద్ వారిచే బెస్ట్ స్కూల్ అవార్డును సంస్థ అందుకుంది. లిటిల్ ఛాంప్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ వారిచే బెస్ట్ స్కూల్ అవార్డు దక్కింది. ఆర్యభట్ట ఎడ్యుకేషనల్ అకాడమీ వారిచే బెస్ట్ స్కూల్ అవార్డు అందుకుంది.

2023 - 24 విద్యా సంవత్సరంలో పరీక్షకు హాజరైన 173 విద్యార్థుల్లో 590 మార్కులు సాధించిన విద్యార్థిని పి.సుమేధా స్కూల్ టాపర్‌గా నిలిచింది. టి.రేణుశ్రీ 584, ఎస్.లావణ్య, ఎన్ కిరణ్‌కుమార్‌రెడ్డిలు 583, కె.మోహన సూర్యతేజస్విని 580 మార్కులు సాధించగా, 100 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారన్నారు.

స్కూల్ ప్రత్యేకతలు...

- నిపుణులైన అధ్యాపక బృందంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన
- స్మార్ట్ క్లాస్‌లో విద్యాబోధన
- మినరల్ వాటర్ సదుపాయం, విశాలమైన ఆటస్థలం
- నిష్ణాతులైన వ్యక్తిత్వ వికాస నిపుణులచే శిక్షణ
- సెమినార్, కామన్‌గేదరింగ్, క్విజ్ నిర్వహణ.
- 6 నుండి 10వ తరగతి వరకూ అబాకస్ ట్రెయినింగ్
- కరదీప్తి ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ వారిచే ఇంగ్లీష్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం.
- నిష్ణాతులైన ఉపాధ్యాయ బృందంచే ఐఐటి, నీట్ ఫౌండేషన్

భవ్యభారతిలో నాణేలు, స్టాంపుల ప్రదర్శన

ప్రజాశక్తి - ఆచంట

ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన నాణేలు నోట్లు, స్టాంపులు అరుదైన ఫొటోలు, నూతన సంవత్సరానికి స్వాగతం పలికే రకరకాల డైరీలు సేకరించడం అభినందనీయమని ఎస్ఐ రాజకుమార్ అన్నారు. ఆచంటలోని భవ్య భారతి విద్యానికేతన్ 33వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం ఆచంటకు చెందిన సామవేదం శ్రీనివాసన్ ఏర్పాటు చేసిన స్టాంప్స్, నోట్స్ కాయిన్స్ ఎగ్జిబిషన్‌ను రాజకుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 80 సంవత్సరాల వయసులో కూడా ఇష్టపూర్వకంగా కాయిన్స్ నోట్స్ సేకరించిన శ్రీనివాసన్‌ను ఆయన అభినందించారు. వివిధ దేశాలకు చెందిన నాణేలతోపాటు అపురూపమైన అరుదైన నాణేలు సేకరణ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మరోఅతిథి మల్లాది రామశాస్త్రి మాట్లాడుతూ రేపటి తరానికి నాణేలు, స్టాంపులు సేకరించే అలవాటు మన సంస్కృతీ, సంప్రదాయాలకు ఆలంబనగా ఉంటుందన్నారు. భవ్య భారతి విద్యానికేతన్ కరస్పాండెంట్ కొలిశెట్టి వైష్ణవిసాయి ప్రియ మాట్లాడుతూ నేటి తరం విద్యార్థుల్లో కేవలం చదువే కాకుండా నైపుణ్యం, విలువలతో కూడిన విద్యనందించడమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భవ్యభారతి విద్యానికేతన్ ప్రధానోపాధ్యాయులు పెద్దింటి సీతారామాచార్యులు, మాముడూరి సుబ్రహ్మణ్యం, సాయి లక్ష్మి, భవాని, గాయత్రి, కృష్ణ అద్విత, సాయి సంహిత, విసాయి హర్షిత, నాగ అదిత్రి పాల్గొన్నారు.

పాలకొల్లులో ఆధునిక జిమ్ ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

మారుతున్న అభిరుచులకు తగ్గట్టు పాలకొల్లు వంటి చిన్న పట్టణంలో ఆధునిక జిమ్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని టిటిడి సభ్యులు మేకా శేషుబాబు అన్నారు. పాలకొల్లు ఇండియన్ బ్యాంకుపైన వారాహి జిమ్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత మద్దాల వాసు, రోటరీ క్లబ్ కార్యదర్శి రావాడ సతీష్, గాదె వెంకన్న, మడ్డు వాసు, కేతా వెంకన్న, దేవరపు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంజిబాబు పుట్టినరోజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) పుట్టినరోజు వేడుకలను పట్టణంలోని జనసేన, టిడిపి నాయకుల ఆధ్వర్యంలో స్థానిక కృష్ణ దేవరాయ కళ్యాణ మండపంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కృష్ణ బలిజ సేవా సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, టిడిపి బిసి సాధికారిత కమిటీ డైరెక్టర్ గంటా త్రిమూర్తులు, తెలుగు యువత నాయకుల మద్దుల రాము ఆధ్వర్యంలో మాజీ అంజిబాబుకు గజమాలతో సత్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారధి, కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో అంజిబాబు కుమారుడు పులపర్తి ప్రశాంత్, మద్దుల, గంటా త్రిమూర్తులు, యలమంచిలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

50 ఏళ్లు దాటిన ఉపాధి కార్మికులకు పెన్షన్ ఇవ్వాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

50 సంవత్సరాలు దాటిన ఉపాధి కార్మికులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.ఆంజనేయులు, మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం రూరల్ మండలం పెద్దగరువు గ్రామంలో గురువారం ఉపాధి హామీ పని ప్రదేశానికి ఎం ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్ వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడారు. పని ప్రదేశంలో మజ్జిగ, తాగునీటి సదుపాయం కల్పించాలని, వేతన ప్లే స్లిప్పులు వారం వారం ఇవ్వాలని కోరారు. జాబ్ కార్డు లేని వారికి జాబ్ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నేలపర్తి ఇమ్మానుయేలు, పాలపర్తి విజయ, మరియమ్మ, దాసరి ప్రేమానందం, అడిదల ప్రభుదాసు, నన్నేటి ఇమ్మానుయేలు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లను సరిచూసుకోవాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కౌంటింగ్ ఏర్పాట్లను ఒకటికి రెండుసార్లు సరిచూసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వశిష్టం కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో సమావేశమై కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు. సెల్‌ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లో కౌంటింగ్ సెంటర్లలోకి ఎవరికీ అనుమతి లేదని, ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి డిపాజిట్ చేయాలని సూచించారు. సిబ్బందికి, ఏజెంట్లకు ఆహార పదార్థాలు అందించడానికి పక్కాగా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ పూర్తయిన అనంతరం ఇవిఎంలను కట్టుదిట్టమైన భద్రత మధ్య జిల్లా ఇవిఎంల గొడౌన్‌కు తరలించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

ప్రజాశక్తి - నరసాపురం

సీతారామపురంలోని అల్లూరి సీతారామరాజు ఓరియంటల్ హైస్కూల్‌లో 1973-74 బ్యాచ్‌లో పదో తరగతి చదివి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆనాటి మిత్రులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గురువారం సీతారామపురంలో కొండేటి కర్ణిక గృహం వద్ద సమ్మేళనం నిర్వహించారు. నాటి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఫొటోలు దిగి మెమెంటోలను అందజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మొగల్తూరు మాజీ ఎంపిపి కత్తిమండ ముత్యాలరావు, మాజీ ఎస్‌బిఐ మేనేజర్ పిట్టా రత్నంరాజు, అయితం సూర్యారావు, కొప్పర్తి భారతి లక్ష్మీ పాల్గొన్నారు.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న కారు

దంపతులకు గాయాలు

ప్రజాశక్తి - నరసాపురం

మోటారు సైకిల్‌ను కారు ఢీకొట్టడంతో దంపతులకు గాయాలయ్యాయి. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చిట్టవరంలో 216 జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం పాలకొల్లు నుండి నరసాపురంవైపు బైక్‌పై వెళ్తున్న దంపతులను, నరసాపురం నుండి పాలకొల్లు వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులకు గాయాలవ్వగా, కారు ముందు భాగం దెబ్బతింది. స్థానికులు క్షతగాత్రులను పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బాధితులను రాజమహేంద్రవరంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారని సమాచారం. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రైల్వే గేటును ఢీకొన్న గుర్తు తెలీని వాహనం

ఉండి:గురువారం గుర్తుతెలియని వాహనం రైల్వే గేటును ఢీకొనడంతో గేటు విరిగిపోయింది. దీంతో కిలోమీటరు మేర ట్రాఫిక్ స్తంభించిపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అసలే ఎండలు మండి పోతుంటే మరోపక్క ట్రాఫిక్ స్తంభించిపోవడంతో ఎండలో సుమారు అరగంటసేపు వేచి ఉన్న వాహనదారుల బాధలు చెప్పలేనివి. వచ్చే ప్రభుత్వమైనా మధ్యలోనే నిలిచిపోయిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను పూర్తి చేసి తొందర్లోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుకుంటున్నారు.

ఘనంగా రాయి సతీష్ పుట్టినరోజు

ఉండి:వైసిపి మండల ఉపాధ్యక్షులు రాయి సతీష్ పుట్టిన రోజు వేడుకలు వైసిపి నాయకులు, కార్యకర్తల సమక్షంలో సీనియర్ నాయకులు గుండాబత్తుల సుబ్బారావు నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుండాబత్తుల సుబ్బారావు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు మాట్లాడారు. పార్టీ పట్ల రాయి సతీష్ అంకితభావంతో పనిచేయడం వల్ల పార్టీ తగిన గుర్తింపు ఇచ్చిందన్నారు. అనంతరం రాయి సతీష్ మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేసి తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడిద వెంకటేశ్వరరావు, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సురవరపు వెంకటాచార్యులు పాల్గొన్నారు.

సరిపల్లిలో శాంతి కమిటీ సమావేశం

ప్రజాశక్తి - గణపవరం


గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు గొడవలు పడకుండా శాంతి కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు నిడమర్రు సిఐ ఎంవి.సుభాష్ అన్నారు. గురువారం సరిపల్లి గ్రామంలో జరిగిన శాంతి కమిటీ సమావేశంలో సిఐ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత గ్రామాల్లో ఎటువంటి గొడవలు జరగకుండా రాజకీయ పార్టీ కార్యకర్తలు గొడవలు, కక్షపూరిత మాటలు మాట్లాడకుండా అందరూ అన్నదమ్ముల వలె మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుండెపోటుతో జక్కరం ఉపసర్పంచి లక్ష్మీపతిరాజు మృతి

గ్రామాభివృద్ధికి ఆయన సేవలు ఎనలేనివి : సిపిఎం

ప్రజాశక్తి - కాళ్ల

జక్కరం గ్రామాభివృద్ధికి లక్ష్మీపతిరాజు చేసిన కృషి ఎనలేనిదని పలువురు నాయకులు కొనియాడారు. జక్కరం గ్రామ మాజీ సర్పంచి, ప్రస్తుత ఉప సర్పంచి కూచంపూడి లక్ష్మీపతిరాజు (67) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన భార్య కూచంపూడి పద్మావతి జక్కరం గ్రామ సర్పంచిగా పనిచేస్తున్నారు. ఆయనకు ఒక కుమార్తె ఉన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ లక్ష్మీపతిరాజు భౌతికకాయానికి నివాళులర్పించారు. అలాగే రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు, కోపల్లె సొసైటీ మాజీ ఛైర్మన్ నంద్యాల రామరాజు (హాట్‌లైన్స్ బాబు), బాగిరాజు అప్పలరాజు, సింగపూరి అప్పలరాజు, పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ ఛైర్మన్ పాతపాటి మురళి రామరాజు, వేగేశ్న కాశీ విశ్వేశ్వరాజు, ఆక్వా రైతుల సంఘం అధ్యక్షులు గాదిరాజు వెంకట సుబ్బరాజు, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ, మాజీ ఎంపిటిసి వేగేశ్న రంగరాజు తదితరులు నివాళులర్పించారు.



లక్ష్మీపతిరాజు భౌతికకాయానికి నివాళు లర్పిస్తున్న బలరాం, నేతలు

40 ఏళ్ల పాటు గ్రామాభివద్ధికి కృషి..

లక్ష్మీపతిరాజు 1981లో జక్కరం గ్రామ ఉప సర్పంచిగా పోటీ చేసి గెలుపొందారు. 2006లో సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2021 పంచాయతీ ఎన్నికల్లో ఆయన వార్డు సభ్యులుగా, ఆయన సతీమణి పద్మావతి సర్పంచిగా పోటీ చేసి గెలుపొందారు. అభ్యుదయ భావాలు కలిగిన లక్ష్మీపతి రాజు అప్పటి పార్లమెంట్ సభ్యులు ఉద్దరాజు రామం గెలుపు కోసం కృషి చేశారు. అనంతరం గ్రామ ఉప సర్పంచిగా ఉంటూ అప్పుడు పార్లమెంట్ సభ్యులు భూపతి రాజు విజయకుమార్ రాజు, ఉప్పలపాటి కృష్ణంరాజు, కొత్తపల్లి సుబ్బారాయుడు, కనుమూరు బాపిరాజుతో సన్నిహితంగా ఉంటూ గ్రామాభివృద్ధికి ఎంపీ నిధులు మంజూరు చేయించి మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేశారు. అప్పటి మాజీ మంత్రి కలిదిండి రామచంద్రరాజు, మాజీ పాతపాటి సర్రాజు కృషితో కూడా ఎమ్మెల్యే నిధులతో రోడ్లు, తాగునీటి కుళాయి అందించేలా, పచ్చదనంతో గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. 40 ఏళ్ల పాటు గ్రామాభివృద్ధికి లక్ష్మీపతి రాజు ఎనలేని కృషి చేశారు.